

భువనగిరిలోని రైతు బజార్

# ఏం కొనలేం..
# తినలేం..

## ఆకాశాన్నంటుతున్న కూరగాయల ధరలు

- ఇటీవల మార్కెట్‌లో భారీగా పెరిగిన రేట్లు
- కిలోపై రూ. 5 నుంచి రూ. 25 దాకా పెరుగుదల
- ఆకుకూరలు ధరలు సైతం పైపైకి..
- తగ్గిన కూరగాయల దిగుబడే కారణం
- మళ్లీ చికెన్ ధరలకు రెక్కలు

**కూరగాయల ధరలు కొండెక్కి కూర్చున్నాయి. కొన్ని రోజులుగా రేట్లు భారీగా పెరుగడంతో సామన్య ప్రజలు వాటిని కొనేందుకు జంకుతున్నారు. ఒక్కో దానిపై రూ.5 నుంచి 25కి పైగా పెరుగడంతో ఏం కొనలేని.. తిన లేని పరిస్థితి నెలకొన్నది. ఆకుకూరలు సైతం అమాంతం పెరిగిపోయాయి. చికెన్ రేట్లు సైతం క్రమంగా పెరుగుతూ వస్తున్నాయి.**

– యాదాద్రి భువనగిరి, జనవరి 1 (నమస్తే తెలంగాణ)

భువనగిరి రైతుబజార్‌కు వలిగొండ, భువనగిరి, బీబీనగర్, బొమ్మలరామారం, ఆలేరు, మోటకొండూరు, తుర్కపల్లి మండలాల్లోని వివిధ గ్రామాల నుంచి పదుల సంఖ్యలో రైతుల కూరగాయలు తీసుకొస్తుంటారు. ఇక్కడికి ముఖ్యంగా దోసకాయ, టమాట, బెండకాయ, సొరకాయలు వస్తుంటాయి. మిగతావి హైదరాబాద్ నుంచి దిగుమతి చేస్తారు. కాగా, ఇటీవల కూరగాయల ధరలు చుక్కలంటుతున్నాయి. కొన్ని రకం రేట్లు ఏకంగా డబుల్ అయ్యాయి. భువనగిరి మార్కెట్ ధరల ప్రకారం పరిశీలిస్తే రూ.5 నుంచి 25కి పైగా పెరిగాయి. గత నెల ఐదో తేదీన కిలో వంకాయ 22 ఉండగా, ఇప్పుడు రూ.44కు పెరిగింది. కిలో బెండకాయ రూ.35 నుంచి రూ.50, దొండకాయ రూ.36 నుంచి రూ.50, బీరకాయ రూ.36 నుంచి రూ.44, దోసకాయ రూ.18 నుంచి రూ.34, చిక్కుడు రూ. 44 నుంచి రూ.60, గోకర రూ.36 నుంచి రూ.70, కాకర 36 నుంచి 54కు పెరిగాయి.

### కూరగాయల ధరలు..(కిలోకు)

| రకం | డిసెంబర్ 5న | జనవరి 1న |
|---|---|---|
| వంకాయ | 22 | 44 |
| దోసకాయ | 18 | 34 |
| బెండకాయ | 38 | 50 |
| దొండకాయ | 36 | 46 |
| బీరకాయ | 36 | 44 |
| చిక్కుడు | 44 | 60 |
| కాకరకాయ | 36 | 54 |
| గోకరకాయ | 36 | 70 |
| బీన్స్ | 46 | 46 |
| టమాట | 20 | 26 |

### ఆకు కూరలు సైతం..

ఆకు కూరలు సైతం పెరిగాయి. పాలకూర, చుక్కకూర, పుంటికూర, పుదీనా, కొత్తమీర తదితర ఆకుకూరల ధరలు పెంచేశారు. ఇటీవల వరకు రూ.20కి నాలుగు కట్టలు ఇస్తుండగా, ఇప్పుడు మూడు కట్టలుమాత్రమే ఇస్తున్నారు. ఇక గతంలో మార్కెట్‌కు రూ.200 తీసుకెళ్తే సంచి నిండా కూరగాయలు వచ్చేవి. ప్రస్తుతం ఆ పరిస్థితులు కనిపించడం లేదు. రేట్లు పెరుగడంతో గతంలో కిలో తీసుకెళ్లేవారు ప్రస్తుతం అర కిలో, పావు కిలో మాత్రమే కొంటున్నారు. ధరలు ఇలా ఉంటే కొనేదెలా అని సామాన్య ప్రజలు వాపోతున్నారు.



### చికెన్ ధరలు పైపైకి..

కార్తీక మాసం, అయ్యప్ప మాలధారణల నేపథ్యంలో 15 రోజుల క్రితం వరకు చికెన్ రేట్లు భారీగా పడిపోయాయి. సుమారు 70 శాతం వరకు ధరలు తగ్గాయి. కిలో డ్రెస్‌డ్ చికెన్ రూ.135, స్కిన్‌లెస్ రూ.160, బోన్‌లెస్ రూ.320, లైవ్ రూ.70 మాత్రమే అమ్మారు. కానీ, ఇటీవల భారీగా తగ్గిన చికెట్ రేట్లకు మళ్లీ రెక్కలొచ్చాయి. ఇప్పుడు కిలో స్కిన్‌లెస్ రూ.190 నుంచి రూ.200 అమ్ముతున్నారు. గుడ్ల రేట్లు కూడా పెరిగిపోతున్నాయి. ఒక కోడి గుడ్డు రూ.6.50 విక్రయిస్తున్నారు. కిలో మటన్ రూ.800 అమ్ముతున్నారు.

### తగ్గిన దిగుబడి, దిగుమతి..

కూరగాయల ధరల పెరుగుదలకు వివిధ కారణాలు దోహదం చేస్తాయని మార్కెట్ అధికారులు పేర్కొంటున్నారు. ఇతర ప్రాంతాల నుంచి కూరగాయలు దిగుమతి అవుతాయి. వర్షాభావ పరిస్థితుల్లో భూగర్భ జలాలు తగ్గుముఖం పడుతున్నాయి. రానురాను కూరగాయాల సాగు తగ్గుతూ వస్తున్నది. ఇటీవల మిగ్‌జాం తుఫాన్ ప్రభావంతో దిగుబడి తగ్గింది. ఆంధ్రప్రదేశ్ నుంచి హైదరాబాద్‌కు తక్కువగా వస్తుండటంతో రైతుబజార్‌కు రావడం లేదు. ఫలితంగా కూరగాయల కొరత ఏర్పడుతున్నది. కొరత కారణం తో ఆటోమెటిక్‌గా ధరలు పెరుగుతున్నాయి.

### ఏం కొనలేని పరిస్థితి..



మార్కెట్‌కు వెళ్లి కూరగాయలు కొనాలంటేనే భయమేస్తుంది. గతంలో రూ.200 తీసుకెళ్తే కూరగాయలు సంచి నిండా వచ్చేవి. ఇప్పుడు ధరలు పెరిగాక.. సగం కూడా రావట్లేదు. ఆకుకూరలు సైతం కొనేలా లేవు. ఏం తినాలన్నా కష్టమే ఉంది.

– తుమ్మేటి కొండల్, భువనగిరి

# నూతనోత్సాహం

## కోటి ఆశలతో కొత్త ఏడాదికి స్వాగతం

- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఘనంగా వేడుకలు
- కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలుపుకున్న ప్రజలు
- ఆలయాలు, చర్చిలకు పోటెత్తిన భక్తులు
- కిటకిటలాడిన యాదగిరి గుట్ట దేవస్థానం

యాదాద్రి భువనగిరి, జనవరి 1 (నమస్తే తెలంగాణ) : 2023వ సంవత్సరం ముగిసి.. కొత్త ఆశలను రేకెత్తిస్తూ 2024వ సంవత్సరం ప్రారంభమైంది. ఈ నేపథ్యంలో ఆదివారం సాయంత్రం నుంచే కొత్త సంవత్సర వేడుకలు మొదలయ్యాయి. పల్లె, పట్నం అనే తేడా లేకుండా ఎక్కడ చూసినా సందడి వాతావరణం నెలకొంది. అర్ధ రాత్రి దాటేంత వరకూ హంగామా కొనసాగింది. మహిళలు, యువతలు కొత్త సంవత్సరానికి స్వాగతం పలుకుతూ ముగ్గులేశారు. ఇక యువత డీజే పాటల్లో మునిగితేలారు. జిల్లాలోని పలు రిస్టార్టుల్లో న్యూఇయర్ సంబురాలు జోరుగా జరిగాయి. సరిగా 12 గంటలకు కేక్‌లు కట్ చేశారు. మిఠాయిలు పంచుకున్నారు. ఒకరికొకరు న్యూ ఇయర్ శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. కొత్త సంవత్సరంలో అంతా శుభమే జరుగాలని ఆకాంక్షించారు. మరికొందరు న్యూ ఇయర్ నేపథ్యంలో కొత రిజల్యూషన్స్ పాటించాలని నిర్ణయించుకున్నారు. ఇక వరుస సెలవుల నేపథ్యంలో యూత్ లాంగ్ టూర్లకు వెళ్లారు. అక్కడే సంబురాలు జరుకుపుకొన్నారు. భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్ రెడ్డి యాదగిరిగుట్ట, మత్స్యగిరి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు.



యాదగిరిగుట్టలో ముగ్గు వేస్తున్న యువతులు

### ఉదయం నుంచే ఆలయాలు కిటకిట..

నూతన సంవత్సరం సందర్భంగా జిల్లాలోని పలు ఆలయాల్లో భక్తులు తెల్లవారుజాము నుంచే పోటెత్తారు. భక్తుల రద్దీతో ఆయా ఆలయాల్లో సందడి వాతావరణం నెలకొంది. కొత్త ఏడాదిలో మంచి జరుగాలని కోరుకుంటూ కుటుంబ సమేతంగా ఆలయాలకు వెళ్లి తమ మొక్కులు తీర్చుకున్నారు. భక్తుల రద్దీతో ఆలయాలు ఆధ్యాత్మిక శోభను సందరించుకున్నాయి. యాదగిరి గుట్ట ఆలయం భక్తులతో కిక్కిరిసి పోయింది. భక్తుల రద్దీ దృష్ట్యా యాదగిరిగుట్టలో దేవస్థాన అధికారులు ఆలయ వేళల్లో మార్పులు చేశారు. స్వామివారి దర్శనం కోసం క్యూలైన్లలో బారులుదీరారు. భక్తుల రద్దీతో బస్ బే, కల్యాణకట్ట, పుష్కరిణి, ఆలయ ఘాట్ రోడ్ పరిసర ప్రాంతాలు సందడిగా మారాయి. అదే విధంగా ఆలేరు మండలంలోని కొలనుపాక సోమేశ్వరాలయం, భువనగిరి మండలంలోని నాగిరెడ్డిపల్లి రమణేశ్వరాలయం, వలిగొండ మండలంలోని వేములకొండ మత్స్యగిరి లక్ష్మీనరసింహస్వామి ఆలయం, భువనగిరి పట్టణంలోని పలు ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి.

### 69 డ్రంకెన్ డ్రైవ్ కేసులు..

కొత్త సంవత్సరం నేపథ్యంలో ఎలాంటి ప్రమాదాలు చోటుచేసుకోకుండా పోలీసులు ముందస్తు చర్యలు చేపట్టారు. మద్యం సేవించి వాహనాలు నడుపవద్దని ముందుగానే ప్రకటించారు. ఈ మేరకు జిల్లాలోని పలు చోట్ల డ్రంకెన్ డ్రైవ్ చేపట్టారు. బీబీనగర్ టోల్‌గేట్, యాదగిరిగుట్ట పట్టణం, చౌటుప్పల్ టోల్‌గేట్, చౌటుప్పల్‌లోని వలిగొండ క్రాస్‌రోడ్డులో డ్రెంకెన్ డ్రైవ్ నిర్వహించారు. మద్యం సేవించి వాహనాలను నడిపిన 69 మందిపై డ్రంకెన్ డ్రైవ్ కేసులు నమోదు చేసినట్లు ట్రాఫిక్ ఏసీపీ ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. వీరికి ఆల్కహాల్ శాతాన్ని బట్టి కోర్టు జరిమానా విధిస్తుందని పేర్కొన్నారు.



వేములకొండలోని మత్స్యాద్రిపై స్వామి వారికి పూజలు చేస్తున్న ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి



భూదాన్‌పోచంపల్లి : దేశ్‌ముఖి సాయి బృందావనంలో పూజలు చేస్తున్న భక్తులు



చిట్యాల మండలం వెల్మినేడు ఆంజనేయస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య



నల్లగొండలోని చర్చిలో ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు



తుర్కపల్లిలో ఇంటి ముందు రంగవల్లులు వేస్తున్న మహిళలు

# లోక్‌సభ ఎన్నికలపై
# గురి

**మార్చిలోనే ఎన్నికలు ఉండవచ్చన్న అంచనా**

**ఎన్నికల సన్నద్ధంలో అధికార యంత్రాంగం**

- సత్తా చాటేందుకు రాజకీయ పార్టీల కసరత్తు
- ఈ నెల 13, 16 తేదీల్లో బీఆర్‌ఎస్ సమావేశాలు
- కాంగ్రెస్, బీజేపీ నుంచి ఆశావహుల హడావుడి
- మొదలైన ఎన్నికల వాతావరణం



నల్లగొండ ప్రతినిధి, జనవరి1(నమస్తే తెలంగాణ) : అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు ఎలా ఉన్నా, లోక్‌సభ ఎన్నికలను అన్ని రాజకీయ పార్టీలు సైతం ప్రతిష్టాత్మకంగానే భావిస్తున్నాయి. ముఖ్యంగా బీఆర్‌ఎస్, కాంగ్రెస్, బీజేపీలు లోక్‌సభ ఎన్నికల్లో సత్తా చాటాలన్న తలంపుతో కనిపిస్తున్నాయి. ఉమ్మడి జిల్లా పరిధిలోని నల్లగొండ, భువనగిరి లోక్‌సభ స్థానాలను గత ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపొందగా.. మరోసారి తమ సిట్టింగ్ స్థానాలను నిలబెట్టుకునేందుకు సిద్ధమవుతున్నది. ఇప్పటికే నల్లగొండకు మంత్రి ఉత్తమ్‌ను, భువనగిరికి మరో మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని ఇన్‌చార్జీలుగా కాంగ్రెస్ పార్టీ నియమించింది. పైగా అసెంబ్లీ ఎన్నికల్లో సాధించిన విజయాల స్ఫూర్తితో లోక్‌సభ స్థానాలను కైవసం చేసుకోవాలన్న పట్టుదలతో కాంగ్రెస్ కనిపిస్తుంది. అయితే, ఆ పార్టీ నుంచి టికెట్లు ఆశిస్తున్న వారి సంఖ్య అధికంగా ఉండడంతో అభ్యర్థుల ఎంపిక ఆసక్తికరంగా మారింది. నల్లగొండ నుంచి ప్రధానంగా మాజీ మంత్రి జానారెడ్డి, లేదంటే ఆయన కుమారుడు రఘువీర్‌రెడ్డి, పటేల్ రమేశ్ రెడ్డి పేర్లు వినిపిస్తున్నాయి. ఇక భువనగిరి నుంచి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, మధుయాష్కీ గౌడ్, కోమటిరెడ్డి మోహన్‌రెడ్డి పేర్లు టికెట్ రేస్‌లో ఉన్నాయి. బీజేపీ సైతం లోక్‌సభ ఎన్నికల్లో తమ పట్టు బిగించాలని భావిస్తున్నా.. ఉమ్మడి జిల్లా పరిధిలో పెద్దగా ప్రభావం ఉండకపోవచ్చని రాజకీయ విశ్లేషకుల అంచనా. అయితే కేంద్రంలోని మోదీ చరిష్మా కలిసొస్తుందని ఆ పార్టీ నేతల భావన. ఇక ఇదే సమయంలో బీఆర్‌ఎస్ లోక్‌సభ ఎన్నికలపై పూర్తి స్థాయిలో సమయాత్తం అవుతున్నది.

### ఈ నెల 13,16 తేదీల్లో సమీక్ష

లోక్‌సభ స్థానాల వారీగా సమీక్షలకు బీఆర్‌ఎస్ సన్నద్ధమవుతుంది. ఈ నెల 3వ తేదీ నుంచి మొదలుకానున్న సమావేశాల్లో భాగంగా 13వ తేదీన భువనగిరి, 16వ తేదీన నల్లగొండ లోక్‌సభ స్థానాల రివ్యూ జరుగనున్నది. ఇందులో పార్టీ అధినేత కేసీఆర్‌తోపాటు వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి, ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డితో పాటు మాజీ ఎమ్మెల్యేలు, ఇతర కీలక నేతలంతా పాల్గొననున్నారు. అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా పరిస్థితి, అభ్యర్థులపై స్పష్టత, ఎన్నికలకు సన్నద్ధం, తదితర అంశాలపై అధినేత కేసీఆర్ దిశా నిర్దేశం చేయనున్నట్లు సమాచారం. సమావేశాల అనంతరం పార్టీ యావత్తు ఎన్నికల కదనరంగంలోకి దిగనున్నట్లు తెలుస్తోంది. ఎన్నికలు మార్చిలోనే వస్తాయన్న అంచనాతోనే సమాయత్తం కావాలన్నది లక్ష్యంగా కనిపిస్తున్నది. రెండు లోక్‌సభ స్థానాల్లో విజయమే లక్ష్యంగా రంగంలోకి దిగనున్నారు.

### అధికార యంత్రాంగం సన్నద్ధం..

ఎన్నికలకు అధికార యంత్రాంగం కూడా సన్నద్ధమవుతున్నది. ఇప్పటికే పోలింగ్ కేంద్రాల గుర్తింపు, ఓటర్ల జాబితా సవరణ చేపట్టారు. ఓటర్ల జాబితా సవరణలో భాగంగా జనవరి1వ తేదీ నాటికి 18 ఏండ్లు నిండిన వారికి కొత్తగా దరఖాస్తులకు అవకాశం కల్పించారు. అదే సమయంలో గుర్తింపు కార్డుల పంపిణీ, మరణించిన వారి ఓటర్ల వివరాల తొలగింపు, ఇతర పొరపాట్లను సవరించేలా చర్యలు చేపట్టారు. ఈ నెల 6వ తేదీన ముసాయిదా జాబితా ప్రకటించి 22 వరకు అభ్యంతరాలు స్వీకరించనున్నారు. ఫిబ్రవరి8న తుది జాబితా ప్రకటిస్తారు. ఇదే సమయంలో 1,450 ఓటర్లకు ఒక పోలింగ్ కేంద్రం చొప్పున ఉండేలా చర్యలు మొదలుపెట్టారు. అదనపు పోలింగ్ కేంద్రాల గుర్తింపును చేపట్టారు. అన్ని వైపులా ఏర్పాట్లపై కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జిల్లా యంత్రాంగాలు పూర్తి స్థాయిలో దృష్టి సారించాయి.

# న్యూ ఇయర్ కిక్

(మొదటి పేజీ తరువాయి)

ఉన్నాయి. ఇక 29న రూ. 3.58 కోట్లు, 30న రూ. 7.09 కోట్లు, 31న రూ.4.68 కోట్ల లిక్కర్ విక్రయాలు జరిగాయి. మొత్తంగా డిసెంబర్ నెలలో రూ. 111.16 కోట్ల మద్యం అమ్మారు. ఇందులో 1,13,109 ఐఎంఎల్ కేసులు, 1,40,132 కేసుల బీర్లు ఉన్నాయి. కాగా 2022 డిసెంబర్‌లో రూ. 89.23 కోట్ల లిక్కర్ మాత్రమే సేల్ అయ్యింది.

### స్టేషన్ల వారీగా అమ్మకాలు ఇలా..

జిల్లాలో 82 వైన్స్‌లు, 12 బార్లు ఉన్నాయి. నాలుగు ఎక్సైజ్ స్టేషన్లు ఉన్నాయి. భువనగిరి, రామన్నపేట, ఆలేరు, మోత్కూరు పరిధిలో స్టేషన్లు ఉన్నాయి. ఇక స్టేషన్ల వారీగా అమ్మకాలు పరిశీలిస్తే భువనగిరిలో రూ. 5.55 కోట్ల విలువైన మద్యం అమ్మకాలు జరిగాయి. ఇందులో 5,557 కేసుల ఐఎంఎల్, 6836 కేసుల బీర్లు ఉన్నాయి. రామన్నపేటలో 3,617కేసుల ఐఎంఎల్, 3,521కేసుల బీర్లతో రూ. 3.58 కోట్ల విలువైన లిక్కర్ అమ్మారు. ఆలేరులో 3,622 కేసుల ఐఎంఎల్, 4,554 కేసులు బీర్లతో రూ. 3.66 కోట్ల విలువైన మద్యం విక్రయించారు. మోత్కూరులో 2571 కేసుల ఐఎంఎల్, 3450 కేసుల బీర్లతో రూ. 2.56 కోట్ల మద్యం అమ్ముడైంది.

### ఇయర్ ఎండ్ వీకెండ్ రావడంతోనే..

ఇయర్ ఎండింగ్ ఈ సారి వీకెండ్ రావడంతో మద్యం విక్రయాలు పెరుగడానికి కారణమయ్యాయి. డిసెంబర్–31 ఆదివారం, అంతకు ముందు శనివారం కావడంతో ఉద్యోగులు మస్త్ జోష్‌లో మునిగిపోయారు. జనవరి 1న సైతం ప్రభుత్వం సెలవుదినంగా ప్రకటించింది. దాంతో పట్టణాల్లో ఉండే వారు సైతం సొంతూళ్లకు వచ్చి వేడుకలు జరుపుకొన్నారు. స్నేహితులు, బంధువులతో సరదాగా గడిపారు. దాంతో మద్యం సేల్స్ భారీగా పెరిగినట్లు తెలుస్తున్నది.

**డిసెంబర్ 29 నుంచి 31వరకు మద్యం అమ్మకాలు (కేసులు.. రూ.లలో)**

| స్టేషన్ | ఐఎంఎల్ | బీర్లు | విలువ(రూ.) |
|---|---|---|---|
| భువనగిరి | 5557 | 6,836 | 5.55కోట్లు |
| రామన్నపేట | 3617 | 3,531 | 3.58కోట్లు |
| ఆలేరు | 3622 | 4,554 | 3.66కోట్లు |
| మోత్కూరు | 2572 | 3450 | 2.56కోట్లు |
| మొత్తం | 15,368 | 18,371 | 15.35కోట్లు |

